క్లుప్తంగా

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): రేషన్ దుకాణాల ద్వారా అందించే నిత్యావసరాలు సక్రమంగా కార్డుదారులకు అందించాలని డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు, గోళ్ళపాడు, చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లోని రేషన్ దుకాణాల ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీ ప్రక్రియను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కార్డుదారులను పంపిణీ ఇబ్బందులపై ఆరా తీశారు. దుకాణదారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. మండలంలో 32% రేషన్ పంపిణీ జరిగిందని, ప్రతి కార్డుదారునికి నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల పోటీలు



నకరికల్లు: పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని రిసోర్స్ పర్సన్ రమాదేవి అన్నారు. పీఎం పోషణ-డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో సోమవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వండే పాత్రలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాజా కూరగాయలు, వంట సామగ్రి వాడాలన్నారు. మెనూను కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడంలో నిబంధనలు పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి పరిశుభ్రత, రుచి ఆధారంగా విజేతలను ఎంపిక చేసి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మేదరమెట్ల స్వామి, మండల కో ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జున రావు, కంప్యూటర్ ఆపరేటర్ ఎస్.అంజమ్మ, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రమౌళీశ్వరుని ఆలయ వార్షిక వేడుకలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 8వ వార్షిక వేడుకలు పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రదక్షిణం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీపారాయణం, రుద్రహోమం అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. స్వామి వారిని, అమ్మవారిని విశేషంగా అలంకరించారు. వార్షిక వేడుకల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని మూడవ రోజు బుధవారం అన్నదాన కార్యక్రమం, విశేష పూజలు ఉంటాయని అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు తెలిపారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ



అచ్చంపేట: పాల దిగుబడి పెంచేందుకు పాల ఉత్పత్తిదారులకు 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను మండలంలోని పలు గ్రామాలలో సోమవారం పంపిణీ చేసినట్టు పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. వేల్పూరు, కోనూరు, గ్రంథశిరి, చెరుకుంపాలెం, పుట్లగూడెం, చింతపల్లి, కొత్తపల్లి, చల్లగరిగ గ్రామాలలో పంపిణీ చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాల దిగుబడిని పెంచుకోవలసినదిగా డాక్టర్ స్వాతీదేవి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జువ్వా శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలే వంతెన

గోరంట్ల మేజర్‌పై వంతెన లేక అవస్థలు పడుతున్న రైతులు

- కాలువ దాటేందుకు స్తంభాలతో తాత్కాలిక ఏర్పాటు
- దూరాన్ని అధిగమించేందుకే ప్రమాదకరంగా ప్రయాణం
- వంతెన నిర్మించాలని కోరుతున్న అన్నదాతలు



చల్లగుండ్ల వద్ద గోరంట్ల మేజర్‌ను సిమెంటు స్తంభాల మీదుగా దాటుతున్న రైతులు

నకరికల్లు: కాలువ దాటేందుకు వంతెన లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. పొలాలకు వచ్చి వెళ్లేందుకు ఐదు కిలోమీటర్లు తిరిగి రాలేక దగ్గరి మార్గం లేక వ్యయప్రయాసలు పడుతున్నారు. మండల పరిధిలోని గుంటూరు బ్రాంచి కెనాల్ నుంచి గోరంట్ల మేజర్ కాలువ వస్తుంది. ఈ కాలువ ద్వారా మండలంలోని నకరికల్లు, చల్లగుండ్ల, రాజుపాలెం మండలంలోని ఇనిమెట్ల, ఉప్పలపాడు తదితర గ్రామాల్లోని పొలాలకు సాగునీరందుతుంది. చల్లగుండ్ల గ్రామంలో సుమారు 5 వేల ఎకరాల పంట భూమి ఉంది. కెనాల్‌కు ఇరువైపులా పొలం విస్తరించి ఉంటుంది. ఈ క్రమంలో కాలువకు అవతల ఉన్న పొలాల రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు కాలువ దాటేందుకు వంతెన లేక అవస్థలు పడుతున్నారు.

- ప్రధానంగా చల్లగుండ్ల గ్రామానికి చెందిన పంట పొలాలు కాలువకు ఇవతలి వైపున సుమారు మూడు కిలోమీటర్ల దూరం మేర విస్తరించి ఉంటాయి. వంతెన లేకపోవడంతో గ్రామం నుంచి హైవే పైకి 3 కిలోమీటర్ల దూరం వచ్చి హైవేపై వంతెన దాటి తిరిగి రెండు, మూడు కిలోమీటర్ల దూరం కాలువ గట్టున వెళ్లాల్సిన పరిస్థితి. వ్యవసాయ పనుల సీజన్‌లో ఉదయం, సాయంత్రం ఇంత దూరం వెళ్లి రాక తప్పదు. రైతుల కష్టాలు ఎన్ఎస్పీ అధికారులకు తెలిసినా సమస్య పరిష్కారం వైపు దృష్టి పెట్టలేదు. అన్నదాతలు పలుమార్లు అర్జీలు అందజేసినా ఫలితం లేకపోవడంతో కష్టాలకు అలవాటు పడిపోయారు.



చల్లగుండ్ల వద్ద గోరంట్ల మేజర్‌ను సిమెంటు స్తంభాల మీదుగా ద్విచక్ర వాహనంతో దాటుతున్న రైతులు

కాలువపై చిన్న ఇనుప వంతెన అయినా నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

పంట పొలాలకు నీరందించే ప్రధాన కాలువ అయిన గోరంట్ల మేజర్ దాటేందుకు ఎన్ఎస్పీ అధికారులు కానీ ప్రభుత్వం కానీ స్పందించకపోవడంతో రైతులే తాత్కాలికంగా విద్యుత్ స్తంభాలను వంతెనలా ఏర్పాటు చేసుకున్నారు. పొలాలకు వెళ్లడానికి కాలువ దాటేందుకు విద్యుత్ స్తంభాలతో మూడుచోట్ల వంతెనలా ఏర్పాటు చేసుకున్నారు. కాలువకు రెండు వైపులా గట్లు కలుపుతూ విద్యుత్ స్తంభాలు వేసి వాటిపై నుంచి దాటి వెళ్తుంటారు. పొలానికి మందుకట్టలు, గడ్డి మోపులు ద్విచక్ర వాహనాలపై వేసుకొని ఇదే స్తంభాలపై ప్రమాదకరంగా వెళ్తుంటారు. ప్రమాదమని తెలిసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తప్పడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వర్షాకాలం స్తంభాలు జారి పడే ప్రమాదం ఉన్నా ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న వంతెనకు వెళ్లలేక ఇదే మార్గాన్ని ఎంచుకున్నారు.

తప్పక ఎంచుకున్నాం



మా గ్రామం గోరంట్ల మేజర్‌కు ఇవతల వైపు ఉంటుంది. మా పొలాలు మేజర్‌కు అవతల వైపున ఉంటాయి. వ్యవసాయ పనుల సీజన్‌లో పొలానికి రోజుకు రెండు సార్లు వెళ్లాలి. గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న వంతెన వద్దకు వెళ్లి తిరిగి రావాలంటే ఐదు కిలోమీటర్ల దూరం వస్తుంది. ప్రతిసారి అంతదూరం వెళ్లి రాలేక విద్యుత్ స్తంభాలు వేసుకొని దాటుకొని వెళ్తున్నాం. స్తంభాలు జారితే ప్రమాదమని తెలిసినా తప్పక ఈ మార్గం ఎంచుకున్నాం.

– గంగిరెడ్డి వెంకటరెడ్డి, రైతు, చల్లగుండ్ల

అధికారులు స్పందించాలి



మా గ్రామ రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే గోరంట్ల మేజర్ కాలువ దాటాల్సిందే. రోజుకు రెండుసార్లు అన్ని కిలోమీటర్ల దూరం తిరిగి రావాలంటే సాధ్యపడేది కాదు. అందుకే సిమెంటు స్తంభాలపై నుంచి దాటుకుంటూ వస్తున్నాం. అధికారులు స్పందించి కనీసం చిన్నపాటి ఇనుప వంతెన నిర్మించినా తాత్కాలికంగా మా సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– తప్పెట్ల వీరాంజినేయులు, రైతు, చల్లగుండ్ల

వెన్నుపోటు దినం ర్యాలీకి తరలిరండి

అమరావతి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచినందుకు నిరసనగా ఈ నెల 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం ర్యాలీకి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 4వ తేదీ ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని క్రోసూరులో నిర్వహించే వెన్నుపోటు దినం ర్యాలీ, హామీలను అమలు చేయాలంటూ అధికారులకు వినతిపత్రం సమర్పించే కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు : మండలంలోని పొడపాడు, మూసాపురం, పాటిబండ్ల గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సివిల్స్ రాంకర్ పవన్‌కళ్యాణ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



అచ్చంపేట: సివిల్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 146వ ర్యాంకు సాధించిన పవన్‌కళ్యాణ్‌ను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పవన్‌కళ్యాణ్ స్వస్థలమైన అచ్చంపేట మండలం రుద్రవరంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అభినందన సభలో ఆయన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలసి పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాలలో ఆణిముత్యాలు ఉంటాయనడానికి పవన్ కళ్యాణ్ నిదర్శనమన్నారు. ర్యాంకర్ పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల సూచనలు, ర్యాంకు సాధించాలన్న లక్ష్యంతో కృషి చేయడం వల్లనే తాను ర్యాంకు సాధించానని తెలిపారు. కార్యక్రమంలో సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, వెన్నా సాంబశివారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్సార్కే సాయిరెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ ప్రార్థన దినోత్సవానికి సిద్ధం కండి

పాస్టర్ నందమూరి క్రిస్టర్

చిలకలూరిపేటటౌన్: ప్రతి ఉదయం 50 మంది దైవ సేవకులు దేశ ప్రజల క్షేమం కోసం చేస్తున్న ప్రార్థనలు సోమవారం పట్టణంలోని ఏసు క్రీస్తు దివ్యశాంతి నిలయంలో జరిగాయి. కార్యక్రమ నిర్వాహకులు పాస్టర్ ఎంఎస్ మూర్తి(సూరిబాబు) అధ్యక్షతన జరిగిన ప్రార్థనల అనంతరం పాస్టర్ ఎస్ క్రిస్టర్ ప్రసంగించారు. ఈస్టర్ నుంచి పెంతెకోస్తు ఆదివారం అయిన జూన్ 8వ తేదీ వరకు నిర్వహించే ఉదయకాల ప్రార్థనలు సోమవారం 44వ రోజుకు చేరుకున్నాయని తెలిపారు. జీయూపీఎఫ్, జేపీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఉదయకాల ప్రార్థనలు ప్రతి రోజు ఒక చర్చిలో కొనసాగుతున్నాయన్నారు. చివరి రోజైన 8వ తేదీన ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఉన్న పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముగింపు ప్రార్థనలకు నియోజకవర్గంలోని క్రైస్తవులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. థామస్, అబ్రహాం, సంసోను, బుజ్జి, శాంతి సాగర్, వీరయ్య, క్రీస్తురాజు, జీవరత్నం పాల్గొన్నారు.

రేపు 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నంబూరుశంకరరావు పిలుపు



క్రోసూరు: ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజల్ని మభ్యపెట్టి, గెలిచిన తర్వాత పథకాలను అమలు చేయకుండా ప్రజల్ని 'వెన్నుపోటు' పొడిచిన చంద్రబాబు ప్రభుత్వ మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు 4వ తేదీన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జగనన్న పిలుపు మేరకు పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద 4వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతుందని, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పీహెచ్‌సీ వైద్యులు

క్రోసూరు: క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ రాంబాబు నాయక్, డాక్టర్ సిరిచందన మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లల్లో దోమలు ఉండేందుకు అవకాశాలున్న వాటిని తొలగించాలన్నారు. పాత టైర్లు, వాడి పడేసిన కొబ్బరి బొండాలు, వినియోగించని కుండలు, తొట్టెలు, పారని మురుగు లాంటివి గమనించుకుని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమల బారిన పడకుండా దోమ తెరలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్, సీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, స్టాఫ్ నర్స్ అంజమ్మ ఫార్మసిస్ట్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు



ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

సత్తెనపల్లి: కార్పొరేట్ స్థాయి వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని 81 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి రూ.65,79,351 విలువ గల చెక్కులను జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భరోసా, పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో ఒక సంవత్సర కాలంలోనే రూ.25 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని ఇంకా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారి విస్తరణ, సత్తెనపల్లి-మాదిపాడు మార్గంలో ఆర్‌ఓబీ నిర్మాణాల పనులను ఏడాది పాలనలో ప్రారంభించుకున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు జిల్లా పరిషత్ నుంచి రూ.90 లక్షల నిధులను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మంజూరు చేశారన్నారు. బార్ కౌన్సిల్ విజ్ఞప్తి మేరకు నూతన కోర్టుల నిర్మాణానికి జెడ్పీ స్థలాన్ని అందజేసేందుకు జిల్లా పరిషత్ ముందుకు వచ్చిందని, చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా నరసరావుపేట రోడ్డులో 2.60 ఎకరాల జెడ్పీ భూమిని కేటాయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరునాళ్లల్లో కళారూపాల ప్రదర్శన అభినందనీయం

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేసిన గోపీచంద్, చినరామిరెడ్డి, మురళి

నరసరావుపేట: సమాజంలో మంచి, నీతిని పెంచి, చెడును, దుర్నీతిని తుంచి, శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత పౌర సమాజం, ప్రభుత్వం పైన ఉందని, ఈ దిశలో కోటప్పకొండ లాంటి తిరునాళ్లలో కొన్ని నాటక కోలాటాల సమాజాలు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయంలో మంచి చిత్రాల అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 26న కోటప్పకొండ తిరునాళ్లలో మంచి కళారూపాలు ప్రదర్శించిన పలు సమాజాల నేతలకు అభినందన, సత్కార సభ నిర్వహించారు. స్థానిక ప్రజాకళా సంస్థల నేతలు చింతలచెర్వు అమరేంద్ర, శ్రీనాథ సాహితి పరిషత్ వ్యవస్థాపకులు స్వర్ణ చినరామిరెడ్డి, వాసవీ ఆర్యవైశ్య అన్నదాన కమిటీ కన్వీనర్ బత్తుల మురళి, విశ్రాంత ఉపాధ్యాయులు కనగాల ఉదయలక్ష్మి, ఈదర నాగశిరోమణి బహుమతి ప్రదాతలుగా పాల్గొని శతాబ్ది గాయకుడు ఘంటసాల వెయ్యి పేజీల రూ.1600 విలువైన పాటల బృహత్ గ్రంథాలను ఆయా కళారూపాల పోటీ విజేతలకు అందజేశారు. నాయుడు విమల, జెట్టి పద్మ (కావూరు విఘ్నేశ్వర మురళీ మహిళా కోలాటం), 113 తాళ్లూరు నుంచి గొట్టం అంజనేయులు (బ్రహ్మంగారి పూర్తి నాటకం), రొంపిచర్ల చక్రవరం రమేష్ రాజు (బ్రహ్మంగారి నాటకం, కోలాటం), కావూరు ఆంజనేయులు, సింగర కొండయ్య (కాకతీయ కళా వేదికపై పద్య నాటకాలు), కర్ణాటి కృష్ణమూర్తి (మంచి సినిమా పాటల కచేరి) ఈ సత్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. మంచి చిత్రాల అభిమాన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈదర గోపీచంద్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, గ్రామీణ జానపద కళలకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడిందని, మంచి కళలను, గ్రంథాలయాలను, పుస్తక పఠన సంస్కృతిని, పౌర సమాజాలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సంస్థ కోశాధికారి కాసు జోగిరెడ్డి తొలుత స్వాగతం పలికారు. కీ.శే. గుమ్మడి, రుద్ర రామారావులకు జోహార్లు ప్రకటించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పీహెచ్‌సీ వైద్యాధికారి జయకృష్ణ ప్రవీణ్



ముప్పాళ్ళలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి జయకృష్ణ, సిబ్బంది

ముప్పాళ్ళ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి వి.జయకృష్ణ ప్రవీణ్ చెప్పారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా మండల కేంద్రమైన ముప్పాళ్ళలో అవగాహన ర్యాలీ సోమవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి వి.జయకృష్ణ మాట్లాడుతూ మంచి నీటిలో చికున్‌గన్యా, డెంగీ వ్యాధులకు కారణమైన దోమలు వృద్ధి చెందుతాయని, మంచి నీటి ట్యాంక్‌లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ నుంచి ముప్పాళ్ళ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్‌లు పీటర్‌డేమియన్, జోస్పిన్‌రాణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

పంచాయతీ కార్యదర్శికి విన్నవించిన వేల్పూరు గ్రామస్తులు



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు, రైతు సంఘం నాయకులు

అచ్చంపేట: మండలంలోని వేల్పూరు, క్రోసూరు గ్రామాల సరిహద్దులోని నాలుగురోడ్ల సెంటర్ వద్ద ఎన్నో రోజులుగా ఆర్ అండ్ బీ రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుందని, అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని, తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుమారు 200 కుటుంబాల వారు నివశిస్తున్నారని, వారికి కనీస మౌలిక సదుపాయలు కూడా లేవన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వేల్పూరు, క్రోసూరు సరిహద్దులలోని 4 రోడ్ల సెంటర్ వద్ద మురుగునీరు ఆర్ అండ్ బీ రోడ్డుపై ప్రవహిస్తుందని, రోడ్డుపై గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని చెప్పారు. తక్షణమే సంబంధిత అధికారులు పరిస్థితిని చక్కబరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గోలి శివశంకర్, బోళ్ల నరసింహారెడ్డి, రవీంద్రారెడ్డి, చేపూరి నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

• ఈ రహదారిపై ప్రయాణమా..!





గారపాడు- లగడపాడు గ్రామాల మధ్య గుంతల మయంగా ఉన్న రహదారి

గుంతల మయంగా గారపాడు వెళ్లే రోడ్డు

మండలంలోని గారపాడు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి ప్రమాద భరితంగా ఉంది. దీనిపై ప్రయాణం అంటేనే ప్రజలు భయపడుఉతన్నారు. ఈ రహదారిలో వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు, కూలీలు గారపాడు, క్రోసూరు, అందుకూరు గ్రామాలకు ప్రయాణిస్తుంటారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాత్రి సమయంలో కనబడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గుంతలను పూడ్చి ప్రయాణ సుఖవంతంగా జరిగేలా చూడాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు. – పెదకూరపాడు

మాకు ఉపాధి పని ఇప్పించండయ్యా...

అమరావతి: కూటమి నేతల రాజకీయ ఒత్తిడి మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు ఇవ్వటం లేదని మండల పరిధిలోని అత్తలూరు గ్రామంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన కూలీలు సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్ డానియేల్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తాము ఎంతో కాలంగా వేసవిలో ఉపాధి హామీ పనులు చేస్తూ జీవనం సాగిస్తామన్నారు. ఈ ఏడాది లక్ష్మీతిరుపతమ్మ గ్రూపు, హోసన్నా గ్రూపు, అంబేడ్కర్ గ్రూపుల సభ్యులకు ఆరు రోజులు మాత్రమే పని కల్పించి ఇక పనిలేదని చెబుతున్నారన్నారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే రాజకీయ నాయకుల ఒత్తిడి వల్ల పని చూపించలేక పోతున్నానని.. వారి మాట వినకపోతే నాకు ఉద్యోగముండదని.. సమాధానమిస్తున్నాడన్నారు. ఇప్పటికైనా మా గ్రూపుల సభ్యులకు కూడా ఉపాధి పని కల్పించాలని తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో బి.సుధాకర్, బి.కృష్ణ, అచ్చియ్య, బి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com